


# కృషి రూపెత్తిన రుషి

## డా॥ వెలగా వెంకటప్పయ్య జీవనయానం

సహస్ర చంద్ర దర్శన సుదీర్ఘ కాలయవనికలో డాక్టరు వెలగా వెంకటప్పయ్యగారి సేవలు ప్రధానంగా గ్రంథాలయ, సాహిత్య రంగాలలోనివి ప్రత్యేకంగా ప్రశంసించదగినవి. గ్రంథాలయ రంగంలో నిబద్ధతతో, అంకితభావంతో పనిచేసిన కాలంలో "గ్రంథాలయాలకి మారుపేరుగా నిలిచారు" అన్నారు నాగభైరవ. "వెంకటపయ్య అనే పేరు గ్రంథాలయానికి మరో పేరు అయ్యింది" అన్నారు సంజీవదేవ్. గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య (పద్మశ్రీ పురస్కార గ్రహీత), వెలగా వారిని తన వారసులుగా గుర్తించి అభినందించి, ఆశీర్వదించారు. వాస్తవానికి అయ్యంకి వెలిగించిన గ్రంథాలయ జ్యోతిని మరో తరానికి తీసుకెళ్ళింది వెలగావారే.

మీరెప్పుడైనా తెనాలి వెళ్ళడం తటస్థిస్తే ఉద్యోగ విరమణానంతరం సొంత ఊర్లో స్థిరపడిన డాక్టరు వెలగావారిని చూచిరండి. అడ్రెస్ కోసం మనం ఏ ప్రయాసపడవలసిన పనేం లేదు. ఇరవై రెండేళ్ల క్రిందటే ఐతానగరంలో, తెనాలి మునిసిపాలిటీ 'డాక్టరు వెలగా వెంకటప్పయ్య వీధి' అని తీర్మానించింది గనుక – వెలగా వెంకటప్పయ్య వీధి అని చెప్పండి. ఎవరైనా మిమ్మల్ని అక్కడకి చేరుస్తారు లేదా అడ్రస్ చెప్తారు. ఇంతకు అయిదారేండ్లకు ముందే గుంటూరు దేవాపురంలో డాక్టరు వెలగా వెంకటప్పయ్య వీధి అని గుంటూరు మునిసిపాలిటీ వారు కూడా ఓ బజారుకు నామకరణం చేశారు. అక్కడే ఆ వీధిలోనే లంకా సూర్యనారాయణగారు సేకరించిన అద్భుత పుస్తక సంచయం ఒకప్పుడుండేది.

**వారు ఏం చేస్తున్నారో గమనించండి :**

తాను రాస్తున్న ఓ పుస్తకాన్నో – ఇతరులు రాసిన ఎవరి జీవిత చరిత్రనో, అడిగిన వారికి ప్రత్యేక సంచికలు, సావనీర్లు డిటిపి చేయిస్తూ ఉండి ఉంటారు. అలా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఇంటివద్దే పనిచేస్తూనే ఉంటారు. మధ్యాహ్నం ఒకింత విశ్రాంతి. చల్లటి కాలమైతే పరుగో పరుగు ! మరలా 4 గంటలకు తెనాలి వెళ్లి రాత్రి 8 గంటలకు తిరిగి రావడం. తన పనిలో నిమగ్నులవడం – కాస్తంత నిద్ర – మరెప్పుడు మెలకువ వస్తే అప్పుడే తన కుర్చీలో కూర్చుని పని – ఇదీ దినచర్య. పై కార్యక్రమాలతో పాటు మిత్రులూ – రచయితలూ – ఎందరో వెంకటప్పయ్యగారి సలహాల కోసం రావడం – మరెందరో ఫలానా చోట ఓ కార్యక్రమం నిర్వహిస్తున్నాం – తమరు తప్పక రావాలని ఆహ్వానించడం – ఇలా ఎన్నో కార్యక్రమాలు ప్రతిరోజూ వెంకటప్పయ్యగారి రాక కోసం ఎదురు చూస్తూనే ఉంటాయి.

ప్రతిరోజూ వచ్చే ఉత్తరాలు వస్తూ ఉంటే వాటికి జవాబులూ వెంట వెంటనే రాసి పోస్టు చేయడం – లేఖన కళ పట్ల వారేమి అనురక్తి కనపరుస్తున్నారో ఆశ్చర్యమేస్తుంది. లేఖన కళలో వెంకటప్పయ్యగారు నిష్ణాతులు. మన వారు గమనించరు కాని, ఉత్తరాల్లో అతి తక్కువ పదాలను ఉపయోగిస్తారు. అయితేనేం ? అవెంత గురుతరమైన, ముఖ్యమైన విషయాన్ని, బాధ్యతను మరెంత బలంగా చెప్తాయో వారి నుంచి ఉత్తరాలు అందుకున్న వారికి తెలుస్తుంది. వారి ఉత్తరాలలోని సొగసు – రాయడంలో మెలకువలు, వీటితో పాటు కొరియర్లు తెచ్చే విలువైన సమాచారం, పుస్తకాలు – వీటన్నిటికీ తగినట్టుగా వెంట వెంట స్పందించి వారికి తగిన సూచనలు – టెలిఫోన్లో కాని – ఉత్తరాల ద్వారా కానీ చెప్పడం.

వెంకటపయ్యగారు తన స్వంత పుస్తకాల రచనలతో పాటు తన వద్దకు వచ్చే వారిలో కాని – తనకు తెలిసిన వారెవరిలో కాని ఏ మాత్రం స్పార్క్ ఉన్నా – వారిని ప్రోత్సహించి ఓ పుస్తకాన్ని రచింపచేయడం – ఇలా ఓ రచయితను తెలుగువారికి పరిచయం చేయడం – అలా వారిచ్చే ప్రోత్సాహంతో రచనలు చేసినవారెందరో! తమ ప్రాంతంలో ఉండి గతించిపోయిన ప్రతిభా వంతులెందరో తమకు తెలుసు గనుక–వారి కుటుంబీకులను ప్రోత్సహించి, సమాచారం సేకరించడంలో తోడ్పడి వారి ద్వారా ఓ

పుస్తకాన్ని రాయించి ప్రచురించడం ఎందరి విషయంలోనో జరిగింది. ఇలా వెంకటప్పయ్య గారు పదవీ విరమణ చేసిన పాతికేళ్ల కాలంలో వారి రచనలు, సంపాదకత్వాలు కలసి వివిధ ప్రచురణకర్తల కోసం రమారమి 50 వేల పుటలలో, సుమారు 300 గ్రంథాలను వెలుగులోకి తెచ్చారు. ఒక్క 2013 సంవత్సరంలో వారి చేతి మీదుగా వెలువడిన నిఘంటు పరిష్కారాలు, ఇతర గ్రంథాలూ కలిపి 10,662 పుటలు ఉంటాయంటే నమ్మశక్యం కాదు. వాస్తవానికి ఇవన్నీ ఒక ఏడాదిలో రాసినవి, పరిష్కరించినవీ కాదు. గత కొన్నేళ్ళగా ఇదే పనిలో ఉంటూ – 2013లో ముద్రణ సౌభాగ్యం పొందాయి.

డాక్టర్ వెలగా చిన్న ఉద్యోగిగా చేరినది మొదలు స్వయంకృషితో అన్ని పరీక్షల్లోనూ కృతార్థులవుతూ, *ఆంధ్రవిశ్వకళాపరిషత్తు* తెలుగు సాహిత్యంలో ఎం.ఎ. పట్టా పుచ్చుకున్నారు. అంతకుముందే ఉస్మానియా యూనివర్సిటీ నుంచి లైబ్రరీ సైన్సులో డిప్లొమా పొందారు. అంతేనా ! *ఆంధ్రవిశ్వకళాపరిషత్తు*లో బాలసాహిత్యం పరిశోధన చేసి డాక్టరేట్ డిగ్రీ 1981లో పొందారు. ఆ సిద్ధాంత వ్యాసానికి అత్యుత్తమైన త్రిపురనేని గోపీచంద్ స్వర్ణపతకం అందుకున్నారు.

మెల్విన్ డ్యూయి గురించి ఓ లైబ్రేరియన్ – “హి ఈట్స్, డ్రింక్స్, స్లీప్స్ అండ్ థింక్స్ ఆఫ్ లైబ్రరీ వర్క్ త్రూ ఔట్ ది ట్వంటీ ఫోర్ అవర్స్, ది వీక్, ది మంత్ అండ్ ది ఇయర్.” సరిగ్గా ఈ మాటలు మన డాక్టర్ వెలగా వెంకటప్పయ్యగారికి కూడా బాగా వర్తిస్తాయి. వర్తిస్తాయి అనే కంటే కూడా ఈ లక్షణాలన్నీ బాగా అతికిపోతాయి. అంతేకాదు పాపం ! డ్యూయిలో ఉండే బలహీనత కూడా వెంకటప్పయ్యగారిలో బాగా పాతుకుని పోయి ఉంది. సమయాన్ని వృధా చేయకపోవడమే కాకుండా ఎప్పుడూ ఏదో ఒక పని, ఏదో, ఎవరిదో ఒక పని నెత్తిన వేసుకుని శ్రమిస్తూ ఉంటారు. డాక్టర్ వెంకటప్పయ్య ఆర్ద్రహృదయం కలవారు కనుక తొందరపడి పరిచితులతో, అపరిచితులతో అనేక వాగ్దానాలు చేసి, వాటిని తీర్చడం కోసం విపరీతంగా కష్టపడతారు – పట్టుదలతో, అదీ ఆయన జీవన విధానంలో ఓ భాగమైపోయింది.

గ్రంథాలయరంగంలో అత్యంత బాధ్యతాయుతమైన క్లిష్టమైన పరిపాలనా సంబంధ పదవి నిర్వహిస్తూ గ్రంథాలయ శాస్త్ర బోధనలో పలు విశ్వవిద్యాలయాలలో భాగస్వాములయ్యారు. సర్టిఫికెట్, డిగ్రీ స్థాయిలో అన్ని పాఠ్యగ్రంథాలు, వివరణాత్మక నిఘంటువులు, ఉద్యమ చరిత్ర, ప్రసిద్ధ గ్రంథాలయాల సేవానిరతుల పరిచయాలు అన్నీ సుమారు 70 గ్రంథాలూ సర్వసమగ్రంగా ఒక్క చేతి మీదుగా సచిత్రంగా వెలుగులోకి తెచ్చారు. లైబ్రరీ సైన్స్ రచనల్లో డాక్టర్ వెలగా వారు సాధించిన ప్రమాణాలు చాలా ఉన్నతమైనవి. వీరి గ్రంథాలు ఆంధ్రప్రదేశ్ అన్ని గ్రంథాలయాలలోనే కాక అమెరికా, కెనడా, నెదర్లాండ్, ఇజ్రాయిల్, జపాన్, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా మొదలైన దేశాలలో 78 గ్రంథాలయాలలో లభిస్తాయని వరల్డ్ క్యాట్ నెట్వర్కు ద్వారా తెలుస్తూంది. వీరి రచనల్లో విశిష్టాంశం. పాశ్చాత్య శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన సిద్ధాంతాల సంవిధానాలను తెలుగు గడ్డపై నెలకొన్న గ్రంథాలయాల నిర్వహణ అమరికకు అనుగుణంగా రూపొందించబడినవి కనుకనే !

డాక్టర్ వెలగా వారి రచనల్లో తెలుగు పలుకుబడి ఎంత పరిమళిస్తుందంటే చదువరి విషయ సరళీకరణకు ముగ్ధులైపోతారు. సాధారణ పాఠకులు కూడా వీరి రచనలు కాలు మీద కాలు వేసుకుని చదువుకుంటారు. వీరి వ్యాసాలలో ఎత్తుగడ – ముగింపులు ప్రత్యేకంగా, విలక్షణంగా ఉంటాయి. అలాగే, గ్రంథాలయ శాస్త్రంలో వీరు రచించిన అనేక పుస్తకాలు చదువరులను ఉత్సాహ పరచడమే కాదు – ఎందరో పాఠకులను అలరించాయి.

**సాహిత్యరంగం :**

ముఖ్యంగా బాల సాహితీరంగంలో వారి కృషి అనుపమానం. చందమామ సంపాదకులు చక్రపాణిగారు జన్మించిన గ్రామంలో వారూ జన్మించడం పురాకృత సుకృతం అంటారు. అందుకే వారు 1949 నుంచి బాలసాహిత్యంలో శతాధిక రచనలు చేశారు. 12 శతకాలకు టీకా తాత్పర్యాలతో వెలయించారు. పిల్లల పొడుపు కథలు, సామెతలు, గేయాలు, జాతీయాలు సహస్రాధికంగా సేకరించి ప్రచురించారు. తెలుగు జాతి సంస్కృతి సంపత్తిని తెలియజేసే, ఒక విజ్ఞాన సర్వస్వాన్ని పోలిన గ్రంథం “మన వారసత్వం” ప్రచురించగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం దీన్ని 2004లో ఉత్తమ తెలుగు గ్రంథంగా పురస్కారమిచ్చి సత్కరించాయి. తెలుగు బాలసాహిత్య పరిషత్



అధ్యక్షులు నాలుగు దశాబ్దాల పాటు బాలసాహిత్య ప్రగతికి తోడ్పడ్డారు. ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ, నేషనల్ బుక్ ట్రస్టు, రిషివ్యాలీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో బాల రచయితల శిక్షణ శిబిరాలు నిర్వహించి, వారిని ప్రోత్సహించారు.

నార్ల వెంకటేశ్వరరావు, ఆవుల సాంబశివరావు, సి. ఆర్. రెడ్డి, సంజీవదేవ్, కొసరాజు, న్యాయపతి రాఘవరావు, అయ్యంకి, చక్రపాణి, పి. ఎన్. కౌలా తదితరుల సంపూర్ణ గ్రంథాలను ప్రచురించి జాతికి మహోపకారం చేశారు. 20వ శతాబ్ది తెలుగు వెలుగుల పేరుతో నాలుగు సంపుటాలలో వెలుగు ప్రముఖుల పరిచయాలు వెలయించారు. ఇదే కోవలో *అందరూ మహానుభావులే* అనే మరో బృహత్తర గ్రంథం గత సంవత్సరం వెలువడింది.

వారు చేసిన సత్కార్యాలలో ముఖ్యమైనవి ప్రొఫెసరు పి. ఎన్. కౌలా, అయ్యంకి వెంకటరమణయ్య, ప్రొఫెసరు పర్వతనేని గంగాధరరావు, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, నాళం కృష్ణారావు, పరుచూరి రామకృష్ణగార్ల పేర్లతో వివిధ విశ్వ విద్యాలయాలలో, ఇతర సంస్థలలో, ఏర్పరచిన ధర్మ నిధులు ప్రధానమైనవి. పావులూరి ట్రస్టుకు సహకారం అందిస్తున్నారు.

**కృషికి గుర్తింపు :**

డాక్టరు వెలగావారి కృషికి గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ *బాలబంధు* బిరుదంతో సత్కరించింది. వయోజన విద్యా రచనలకు నాలుగు పర్యాయాలు కేంద్ర ప్రభుత్వ పురస్కారాలు లభించాయి. సుబ్బరామిరెడ్డి కళాపీఠం వారి అయ్యంకి వెంకటరమణయ్య అవార్డు, రామినేని ఫౌండేషను అవార్డు, గాడిచర్ల ఫౌండేషను అవార్డు, వావిలాల స్వర్ణపతకం, సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ ప్రతిభా పురస్కారం ఇలా జీవితకాలంలో ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం వీరిని రాజా రామ్మోహన్‌రాయ్ లైబ్రరీ ఫౌండేషనులో రెండు పర్యాయాలు సభ్యునిగా నామినేట్ చేసింది. ఇటీవల కేంద్ర సాహిత్య అకాడెమీ సలహా మండలి సభ్యునిగా ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర గ్రంథాలయ సమితి, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్, గ్రంథాలయ శాసన నిర్మాణం, పుస్తకాల కొనుగోలు విధానం ఇలా పలు కమిటీలలో సభ్యునిగా నియమించి వారి సేవలను వినియోగించుకున్నారు.

**వారి జీవితంలో తృప్తినిచ్చిన అంశాలు :**

పుస్తకాల ప్రేమికునిగా, సాహిత్యాభిరుచి గలవారిగా పౌర గ్రంథాలయశాఖలో ఉన్నతోద్యోగం; గాడిచర్ల, దాశరథి, ఆలపాటి రవీంద్రనాథ్, కొండూరి వీరరాఘవా చార్యులు, చక్రపాణి, కొలసాని, మహాపండితులైన అబ్బూరి రామకృష్ణారావు, జి.వి. కృష్ణరావుగార్ల అంతే వాసిత్వం. గ్రంథాలయ పితామహ అయ్యంకి వెంకటరమణయ్య వారితో రెండు దశాబ్దాలు సన్నిహితంగా మెలిగే అదృష్టం. మద్రాసు, అలీఘర్, జమ్మూ యూనివర్సిటీలు, ఢిల్లీ గ్రంథాలయం సంఘం, గుంటూరులోని అన్నమయ్య గ్రంథాలయాలకు ఒక్కొక్క దానికి లక్ష రూ. మూలధనం ఇచ్చి ప్రొఫెసర్ కౌలా ధర్మనిధి ఉపన్యాసాలు ఏర్పాటు. భారత గ్రంథాలయ రంగ ప్రముఖులు రంగనాథన్, కేశవన్, పి.ఎన్. కౌలా, కాలియా, మంగ్లా, కల్పనాదాస్ గుప్త, తిలైనాయగం, సి.పి. వాశిష్ట, ఎ.ఆర్.డి. ప్రసాద్, పి.ఎస్.జి. కుమార్ తదితరులతో మెలిగే అవకాశం.

ప్రపంచ ప్రసిద్ధ గ్రంథాలయాలైన *లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్*, వాషింగ్టన్, లెనిన్ లైబ్రరీ, మాస్కో; బ్రిటీష్ గ్రంథాలయం, లండన్‌లను స్వయంగా చూసే అదృష్టం. మన దేశంలో అన్ని రాష్ట్రాల కేంద్ర గ్రంథాలయాల సందర్శన.

ఏడాదికి సుమారు 400 గ్రంథాలకు తగ్గకుండా, ప్రతి రోజు కనీసం ఒక గ్రంథం కాంప్లిమెంటరీగా రచయితల నుంచి అందుకునే మహాద్భాగ్యం. ఈ గ్రంథాలను గుంటూరులోని అన్నమయ్య గ్రంథాలయానికి బహూకరణ. ఒరిస్సా, బీహార్, పాండిచ్చేరి, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల పౌర గ్రంథాలయాల చట్ట నిర్మాణంలో సహకారం. అయ్యంకి, నార్ల, చక్రపాణిగార్ల శతజయంతి ఉత్సవాల నిర్వహణ, కవిరాజు త్రిపురనేని రామస్వామి, అయ్యంకి వెంకటరమణయ్య 125 జయంతి ఉత్సవాల నిర్వహణ. సావనీర్ల ప్రచురణ. కుటుంబ బాధ్యతలు పెద్దగా లేకపోవడం – జీవిత కాలంలో జబ్బు పడని ఆరోగ్యం, కళ్ళజోడు అవసరం రాని నేత్రసౌభాగ్యం. సాదాసీదా జీవనం వారి జన్మజన్మల తపఃఫలం. మి

---

గుడిపూడి సుబ్బారావు
ఖమ్మం జిల్లా